## రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజన్‌శేఖర్

**ఉప్పల్, జూన్ 19:** నాచారంలోని రాఘవేంద్రనగర్‌లో రూ.35 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ శాంతి సాయి జన్ శేఖర్ గురువారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాచారంలో దాదాపుగా అన్ని ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ సమస్య పరిష్కరించి, సీసీరోడ్లు వేయిస్తున్నామన్నారు. రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ వినీత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయకుమార్, బీఆర్‌ఎస్ నాయకులు సాయిజన్‌శేఖర్, విఠల్‌యాదవ్, ప్రభావతి, బుచ్చన్న గౌడ్, అశోక్,నరసింహారెడ్డిపాల్గొన్నారు.

## చెత్తను రోడ్ల పక్కన వేయొద్దు



శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్

**మల్లాపూర్, జూన్ 19:** వర్షాకాలం నేపథ్యంలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌ను గురువారం హెచ్‌బీ కాలనీ డివిజన్లో కార్పొరేటర్ ప్రభుదాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన హెచ్‌బీకాలనీ ఆనంద్‌నగర్ తిరుమలనగర్, కృష్ణానగర్, లక్ష్మీనగర్, ఇందిరానగర్ కాలనీల్లో వీధుల్లో చెత్తను ప్రత్యేక వాహనాల ద్వారా తొలగింపజేయించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు పక్కన చెత్త వేయకుండా చెత్తఆటోల్లో వేయాలన్నారు.కార్యక్రమంలో మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ మధుసూదన్, శానిటరీ సూపర్వైజర్ సుదర్శన్, యు.బి.డి సూపర్వైజర్ నరేష్ సర్కిల్ ఇన్‌చార్జి సూపర్వైజర్ నవీన్ రెడ్డి అనిల్, పారిశుధ్య సిబ్బంది, జవాన్, పాల్గొన్నారు.

## తాగునీటి పైపులైన్‌ను పునరుద్ధరించండి

**బోడుప్పల్, జూన్ 19:** బోడుప్పల్ నగరపాలక సంస్థ పరిధిలోని న్యూహేమానగర్ కాలనీలో పైపులైను పగిలి నీరు వృథాగా పోవడంతో తాగునీటి సరఫరా సరిగా జరగడం లేదని కాలనీవాసులు పేర్కొన్నారు. రెండు నెలలుగా క్రితం న్యూ హేమానగర్ వాటర్ సంపు దగ్గర పైపులైను పగిలి తాగునీరు వృథాగా పోతున్న నేపథ్యంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా జలమండలి అధికారులు, సిబ్బంది పట్టించుకోవడంలేదని ఆరోపించారు. వెంటనే పగిలిన తాగునీటి పైపులైనును పునరుద్ధరించి సమస్యను వెంటనే పరిష్కరించాలని స్థానిక కాలనీవాసులు శివ యాదవ్ డిమాండ్ చేశారు.

# కాలనీల్లో అభివృద్ధి పనులు చేపడుతాం



వెంకటాపురం డివిజన్ సాయి దత్త కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, కార్పొరేటర్ సబితా కిశోర్

- అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే 'మర్రి' శంకుస్థాపన
- పలు సమస్యలపై ఎమ్మెల్యేను కలిసిన పలువురు

**మల్కాజిగిరి,జూన్ 19:** రోడ్ల నిర్మాణంలో నాణ్యతను పాటించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం వెంకటాపురం డివిజన్ సాయి దత్తకాలనీలో రూ. 9లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు, టెలికం కాలనీ పార్క్‌లో రూ. 3లక్షలతో లోన్ ఏర్పాటు పనులకు ఎమ్మెల్యే, కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి మాట్లాడుతూ అన్ని కాలనీల్లో రోడ్లు, పార్కులను సర్వే చేయించి అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు నంది, కాంతి, శ్రీధర్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

### మౌలిక వసతులు కల్పిస్తాం

మౌలిక వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం వెంకటాపురం డివిజన్ టెలికాం కాలనీలో పార్కులో రూ.1.5 లక్షలతో లాన్, వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులకు కార్పొరేటర్ సబితకిశోర్, మాజీ ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్‌తో కలిసి గురువారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి మాట్లాడుతూ భూదేవీనగర్‌లోని ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్‌కు వెంకటాపురం టెలికం కాలనీ వెళ్లేందుకు మార్గం పునరుద్ధరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. సీసీ రోడ్లు వేస్తామని, గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేస్తామన్నారు. సీనియర్ సిటిజన్స్‌కు స్పోర్ట్స్ మెటీరియల్ త్వరలోనే అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో హార్టికల్చర్ మేనేజర్ ప్రవీణ, భాస్కర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

### మొహర్రానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేయాలి

బోయిన్‌పల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మౌలాలి చిన్నగుట్ట పరిసర ప్రాంతాల్లో 15 అసుర్ ఖానాలోల మొహర్రం పండుగ సందర్భంగా పారిశుధ్య నిర్వహణ, వీధి దీపాల ఏర్పాటు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ సరఫరా, రోడ్లకు మరమ్మతులు చేయాలని మర్రి రాజశేఖర్ రెడ్డికి నాయకులు గురువారం వినతి పత్రం అందజేశారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో తొలి సీఎం కేసీఆర్ అన్ని పండుగలను అధికారికంగా నిర్వహించేవారని అన్నారు. మొహర్రం పండుగకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లను చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు అమినుద్దీన్, ఉస్మాన్, రాజశేఖర్ రెడ్డి, దినేష్, మారుతీప్రసాద్, అసుర్ ఖానాల నిర్వాహకులు రజాభాయ్, సాజిద్ హుస్సేన్, సాబర్ భాయ్, సయ్యద్ హబీబ్ హాలీ, జావేద్ పాల్గొన్నారు.






సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న టెలికంకాలనీ వాసులు, మైనార్టీ నాయకులు

# ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల్లో రాయితీ ఇవ్వాలి



ప్రైవేటు విద్యా సంస్థలు ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**రామంతాపూర్ ,జూన్ 19:** ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఫీజుల్లో 50 శాతం రాయితీని ఇవ్వాలని ఉప్పల్ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆ యాజమాన్యాలకు సూచించారు. గురువారం పలు ప్రైవేటు స్కూళ్లల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో కార్మిక, పేద, మధ్యతరగతి కుటుంబాలు అధికంగా ఉంటాయన్న ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ఫీజులలో రాయితీ ఇచ్చేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలోపార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### మన్‌మోహన్‌రెడ్డికి ఎమ్మెల్యే పరామర్శ

**చర్లపల్లి:** ఈసీఐఎల్ చౌరస్తాలోని జ్ఞినియా దవాఖానలో చికిత్స పొందుతున్న చర్లపల్లి డివిజన్‌కు చెందిన మన్‌మోహన్‌రెడ్డిని గురువారం ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయ వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మహేశ్‌గౌడ్, సాయిజెన్‌శేఖర్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



దవాఖానలో చికిత్స పొందుతున్న మన్‌మోహన్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బండారి

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**మల్కాజిగిరి, జూన్ 19:** నేరేడ్‌మెట్ డైట్, దేవినగర్ విద్యుత్ 11 కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందన విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సుమన క్రిస్టియన్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎల్బీనగర్,వినాయక నగర్ బ్లాక్ –2, దినకరణ్ నగర్, ఓల్డ్ నేరేడ్‌మెట్, న్యూ విద్యానగర్, కేశవ్ నగర్, డైట్ కాలేజీ, దేవి నగర్, భగతసింగ్ నగర్. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కృపాకాంప్లెక్స్, శ్రీకృష్ణ నగర్, సీతారామ్ నగర్, సైనిక్ నగర్, రాంబ్రహ్మ నగర్, దేవి నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

## యోగాతోనే మానసిక ప్రశాంతత

**జవహర్‌నగర్, జూన్ 19:** యోగాతోనే మానసిక ప్రశాంతత సిద్ధిస్తుందని, దైనందిక జీవితంతో యోగాను భాగం చేసుకోవాలని యోగా గురువు శంకరాచారి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జవహర్‌నగర్ కార్పొరేషన్ అంబేద్కర్‌నగర్ శివాలయం సమీపంలో అనిల్ ఆధ్వర్యంలో గురువారం యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు.

## సీఎంఆర్ టీపీ అధ్యాపకురాలికి డాక్టరేట్



రత్నకుమారి

**మేడ్చల్, జూన్ 19:** గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయలోని సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్‌కు చెందిన అధ్యాపకురాలు రత్నకుమారికి డాక్టరేట్ లభించింది. మెకానికల్ ఇంజినీరింగ్ థర్మల్ విభాగంలో 'ఇన్వెస్టిగేషన్స్ , ఎమిషన్ అండ్ కంబషన్ క్యారెక్టరిస్టిక్స్ ఆఫ్ సీఐ ఇంజిన్ యూసింగ్ లైజ్నో సెల్లులోసిక్ బయో ఫ్యూయెల్స్ ' చేసిన పరిశోధన పత్రాలను జేఎన్‌టీయూహెచ్ ఆమోదించి, పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా రత్నకుమారి మాట్లాడుతూ తాను విజయవంతంగా పీహెచ్‌డీ పూర్తి చేసేందుకు సహకరించిన డాక్టర్ రాజిరెడ్డి, డాక్టర్ విద్యా సాగర్, సీఎంఆర్ చైర్మన్ గోపాల్, సీఈవో అభినవ్ రెడ్డి, కార్యదర్శి వసంతలతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే లక్ష్యం

**ఘట్ కేసర్, జూన్ 19:** ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే లక్ష్యమని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. ఘట్ కేసర్ పట్టణం బాలాజీనగర్‌కు చెందిన మహ్మద్ అహ్మద్ది బేగం అనారోగ్యంతో కార్పొరేట్ దవాఖానలో చికిత్స పొంది ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుండటంతో సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా ఎమ్మెల్యే మల్లారెడ్డి సహకారంతో మంజూరైన రూ. 27వేల విలువగల చెక్కును గురువారం వారికి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా సోషల్ మీడి యా సభ్యులు ఎండీ సిరాజ్ పాల్గొన్నారు.



లబ్ధిదారునికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

# మొక్కల సంరక్షణకు చర్యలు చేపట్టాలి



నాగారం మున్సిపాలిటీలో మహిళా సంఘాలు తయారు చేసిన వస్తువులను పరిశీలిస్తున్న సీడీఎంఏ అసిస్టెంట్ డైరెక్టర్ జ్యోత్స్న

**మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 19:** మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు చర్యలు చేపట్టాలని సీడీఎంఏ అసిస్టెంట్ డైరెక్టర్ జ్యోత్స్న సూచించారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం నాగారం మున్సిపాలిటీలో ఆమె పర్యటించారు. రాంపల్లి 3వ వార్డులో మొక్కలు నాటి నీరు పోశారు. వీధి కుక్కల నియంత్రణ కేంద్రం, కంపోస్ట్ తయారీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు.

అనంతరం మహిళా సంఘాలతో సమావేశంలో ఆమె పాల్గొని వారు తయారు చేసిన వస్తువులను పరిశీలించారు. కార్యక్రమంలో కమిషనర్ భాస్కర్ రెడ్డి, మేనేజర్ సురేష్ రెడ్డి, డీఈఈ సంతోష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మౌలాలి ఆర్టీసీ కాలనీ నుంచి బస్సులు నడపాలి



కుషాయిగూడ ఆర్టీసీ బస్ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేసిన ఐద్వా మహిళలు

**మల్కాజిగిరి, జూన్ 19:** మౌలాలి ఆర్టీసీ కాలనీ నుంచి బస్సులు నడపాలని మల్కాజిగిరి ఐద్వా మండల కమిటీ కార్యదర్శి పి.మంగ అన్నారు. గురువారం మౌలాలి ఆర్టీసీ కాలనీ నుంచి సికింద్రాబాద్, ఈసీఐఎల్‌కు బస్సులు నడపాలని కుషాయిగూడ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు ఐద్వా మహిళా నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా కార్యదర్శి పి.మంగ మాట్లాడుతూ మౌలాలి ఆర్టీసీ కాలనీ నుంచి సికింద్రాబాద్‌కు ఈసీఐఎల్‌కు బస్సు సౌకర్యం చాలా తక్కువగా ఉందన్నారు. ఇక్కడ ప్రజలు సికింద్రాబాద్, ఈసీఐఎల్ పరిసర ప్రాంతంలో పనిచేస్తుంటారని, స్కూల్, ఉద్యోగం, దవాఖానకు వెళ్లే వారికి బస్‌సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆర్టీసీ అధికారులు జోక్యం చేసుకొని మౌలాలి ఆర్టీసీ కాలనీ నుంచి బస్సులు నడపాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు రాజ్యలక్ష్మి, లత, పద్మ, స్వరూప, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో యువ వైద్యుడి మృతి



రాజ్‌కుమార్(ఫైల్)

**మేడ్చల్, జూన్ 19:** అనారోగ్యంతో యువ వైద్యుడి మృతి చెందిన ఘటన మేడ్చల్ మున్సిపాలి పరిధిలో జరిగింది. మేడ్చల్ పట్టణంలోని నర్సింగ్‌రావు, యశోద దంపతుల కుమారుడు డాక్టర్ రాజ్‌కుమార్ గురువారం తెల్లవారుజామున రక్తపోటుతో అనారోగ్యానికి గురి కావడంతో స్థానికంగా ప్రథమ చికిత్స అందజేశారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నగరంలోని సుచిత్రలో ఉన్న ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అక్కడ నుంచి పొందుతూ ఉదయం మృతి చెందాడు. యువ వైద్యుడైన రాజ్‌కుమార్ ఆర్థోపెడిక్ సర్జన్‌లో పలు కార్పొరేట్ ఆస్పత్రుల్లో సేవలు అందించారు. ఇటీవల మేడ్చల్ పట్టణంలో మల్టీ స్పెషాలిటీ దవాఖాన నెలకొల్పి వైద్య సేవలు అందిస్తున్నారు. అంతలోనే అనారోగ్యంతో మృతి చెందడం స్థానికులను కల్చివేసింది. అంత్యక్రియల్లో స్థానికులు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని, నివాళులర్పించారు.



కీసర: చీర్యాల్‌లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ రాధికగుప్త



ఎదులాబాద్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్త

# ఇందిరమ్మ ఇండ్లను నాణ్యతతో నిర్మించాలి

**ఇండ్ల నిర్మాణాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్ రాధిక గుప్తా**

**కీసర, జూన్ 19:** ఇందిరమ్మ ఇండ్లను నాణ్యతతో నిర్మించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్త సూచించారు. దమ్మాయిగూడ మున్సిపాల్టీ పరిధి చీర్యాల్‌లో ఇందిరమ్మ ఇండ్లను, అహ్మద్‌గూడలోని 4వ వార్డులోని ప్రభుత్వ స్కూల్, వీకర్ సెక్షన్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం అడిషనల్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేదల కోసం ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 5లక్షలు వెచ్చిస్తున్న ఇండ్ల నిర్మాణంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నాగమణి, డీఈఈ బాలమురళి, డీఈఈ భగవంత్‌రావు, పంచాయతీ కార్యదర్శి నారాయణగౌడ్ పాల్గొన్నారు.

**ఘట్‌కేసర్:** ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఘనపూర్, ఏదులాబాద్ గ్రామాల్లో గురువారం జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా పర్యటించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏదులాబాద్‌లోని అంగన్ వాడీకేంద్రంలో విద్యుత్, తాగునీరు సమస్యతో పాటు పరిశుభ్రతను పరిశీలించారు. తాగునీటి సరఫరా నిరంతరం కొనసాగేలా చర్యలు తీసుకోవాలని ఏఈ రాకేష్‌ను ఆదేశించారు. చుట్టూ ప్రహరీ కావాలని కోరటంతో ప్రహరీ నిర్మాణంతోపాటు అదనపు గదులను ఏర్పా టు చేయాలని పంచాయతీ రాజ్ ఏఈ జగపతిబాబును వారు ఆదేశించారు.

మున్సిపల్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు లేకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆమె సూచించారు. ఘనపూర్ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. ఇంటి నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. పథకాలను సద్వినియోగపరుచుకోవాలని ఆమె చెప్పారు. అడిషనల్ కలెక్టర్ వెంట కమిషనర్ చంద్రశేఖర్, మేనేజర్ వేణుగోపాల్ రెడ్డి, ఆర్ఐ కవిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చర్లపల్లి చెరువును సందర్శించిన హైడ్రా కమిషనర్



చర్లపల్లి చెరువు అభివృద్ధి ప్రణాళికలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుంటున్న జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా, హైడ్రా కమిషనర్ రంగనాథ్, జైలు అధికారులు

**చర్లపల్లి, జూన్ 19 :** చర్లపల్లి చెరువును తెలంగాణ జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రా, హైడ్రా కమిషనర్ ఏవీ.రంగనాథ్ గురువారం సందర్శించారు. చర్లపల్లి చెరువును అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు తాగునీటి సరస్సుగా రూపుదిద్దడంలో భాగంగా జైళ్ల శాఖ, హైడ్రా, రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్‌ఎంసీ అధికారులు చెరువును సందర్శించి చెరువును ఆధునీకరించడంతో పాటు సుందరంగా తీర్చిదిద్దడంపై చర్చించారు. జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా, హైడ్రా కమిషనర్ రంగనాథ్ చెరువు చుట్టూ పర్యటించి చెరువునీటి ఇన్‌లెట్, ఔట్‌లెట్‌లను పరిశీలించారు. చెరువును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి పర్యాటక విహార కేంద్రంగా తీర్చిదిద్దడంపై వారు ఆయా విభాగాల అధికారులతో కలిసి చర్చించారు. చెరువు వద్ద వీధిదీపాల నిర్వహణ, చెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు, చెరువుకట్టను మరింత అభివృద్ధి చేయడంతో పాటు సీసీ కెమెరాల ఏర్పాటుపై చర్చించారు. అనంతరం చర్లపల్లి కేంద్ర కారాగారంలో వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. హకీంపేట నుంచి కాప్రా చెరువు ద్వారా చర్లపల్లి చెరువు నీరందుతుందని, చెరువులో మురుగు కలువకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. చెరువు చుట్టూ 3కిలోమీటర్లు నడకదారి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేయాలని, చర్లపల్లి పారిశ్రామికవాడకు చెందిన ప్రతినిధులు సామాజిక బాధ్యతలో భాగంగా నిధులు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని జైళ్ల శాఖ డీజీ తెలిపారు.

సమావేశంలో చెరువుకు సంబంధించిన వీడియో, చెరువు అభివృద్ధికి చెందిన ప్రణాళికలను జైలు శాఖ అధికారులు పవర్ పాయింట్ ద్వారా వివిధ విభాగాల అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో హైడ్రా అగ్నిమాపక శాఖ అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్య, జైళ్ల శాఖ డీజీ మురళీబాబు, డీఐజీలు శ్రీనివాస్, సంపత్, చర్లపల్లి జైలు సూపరింటెండెంట్ శివకుమార్‌గౌడ్, ఖైదీల వ్యవసాయక్షేత్రం సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ జిల్లాలో రైతు భరోసా అందించాలి

**దుండిగల్, జూన్ 19:** రైతు భరోసా నిధులను రైతులందరికీ వర్తింపజేయాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్)చైర్మన్లు ఎఫ్ఏసీఎస్ చైర్మన్లు, రైతులతో కలిసి గురువారం కలెక్టర్ మనుచౌదరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా రెండో విడుత నిధులను విడుదల చేస్తున్నప్పటికీ జిల్లా పరిధిలోని ఏ ఒక్క రైతు అకౌంట్లో నిధులు జమ చేయడం లేదని పేర్కొన్నారు. మూడు రోజుల్లో రైతులందరికీ రైతుభరోసా డబ్బులు వేయకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని పీఏసీఎస్ చైర్మన్లు హెచ్చరించారు. అనంతరం జిల్లా వ్యవసాయశాఖ అధికారికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో బౌరంపేట, శామీర్‌పేట్, డబిల్‌పూర్, మేడ్చల్, కీసర, పూడూరు పీఏసీఎస్ చైర్మన్లు బాల్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, సురేశ్ రెడ్డి, రణదీప్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## ఇద్దరు అదృశ్యం

**జవహర్‌నగర్,జూన్ 19:** యువతి అదృశ్యమైం ది. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి దమ్మాయిగూడలో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌వో సైదయ్య కథనం ప్రకారం.. . దమ్మాయిగూడలోని ద్వారకపూరికాలనీలో తారాచంద్, భార్య జ్యోతి, కుటుంబసభ్యులతో కలిసి నివసిస్తున్నారు. కుమార్తె రింకు(19) ఈనెల 19న బయటకు వెళ్ళి తిరిగిరాలేదు. దీంతో ఆమె ఆచూకీ కోసం వెతికినా సమాచారం లభించలేదు. ఈ మేరకు కుటుంసభ్యులు గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**మరో వృద్ధుడు**

జమ్మిగడ్డ పరిధిలోని భరత్‌నగర్‌లో ఓ వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఈనెల 6న ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లిన నల్ల తీగల నర్సయ్య(85) ఇంత వరకు తిరిగి రాలేదు.దీంతోనర్సయ్య ఆచూకీ కోసం వెతికినా సమాచారం లభించలేదు. మనవడు అఖిల్ గురువారం జవహర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వాడొద్దు'

**దుండిగల్, జూన్ 19:** సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా దుండిగల్ మునిసిపాలిటీ పరిధిలోని పలు కిరాణా షాపులు, హోటల్స్, చికెన్, మటన్ దుకాణాలపై మున్సిపాలిటీ ప్రత్యేక బృందాలు గురువారం తనిఖీలు చేపట్టాయి. ఈ సందర్భంగా సింగల్ యూస్ ప్లాస్టిక్ వస్తువులను అమ్మేవారికి జరిమానా విధించారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల బదులు ప్రజలు జూట్ బ్యాగులు, కర్ర సంచులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, ఇంజినీర్ సాత్విక్, వార్డ్ ఆఫీసర్లు, జవాన్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## గంజాయి చాక్లెట్లు స్వాధీనం

**మేడ్చల్, జూన్ 19:** మేడ్చల్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అయోధ్య చౌరస్తాలో గంజాయి చాక్లెట్లు లభ్యమయ్యాయి. ఎక్సైజ్ సీఐ నవనీత కథనం ప్రకారం...రూట్ వాచ్‌లో భాగంగా గురువారం అయోధ్య చౌరస్తా వద్ద ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించగా అనుమానాస్పదంగా కన్పించిన వ్యక్తిని తనిఖీ చేయగా 5.170 కిలోల గంజాయి చాక్లెట్లు లభించాయి. విచారణలో అతడిని ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన జయరామ్ మిశ్రా తన స్వగ్రామంలో గుర్తుతెలియని వ్యక్తి నుంచిగంజాయి చాక్లెట్లు కొని, అయోధ్య చౌరస్తా చుట్టు పక్కల ప్రాంతాల్లోని శ్రామికులు, విద్యార్థులకు అధిక ధరకు అమ్మి అర్జిస్తున్నట్టు గుర్తించారు. మిశ్రాను అరెస్ట్ చేసి, చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అతడిపై ఎన్‌డీపీఎస్ కింద కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ సీఐ నవనీత, ఎస్సై వెంకట్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**మేడ్చల్, జూన్ 19 :** మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు కిష్టాపూర్‌లోని వీకర్ సెక్షన్ కాలనీ, అర్చన కాలనీలో రూ.37.50 లక్షల సీఅండ్ ఐజీఆర్‌ఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ త్రిసభ్య కమిటీ సభ్యులు నవీన్ రెడ్డి, మేడ్చల్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ రమేష్, మేడ్చల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మండల అధ్యక్షులు గోమారం రమణారెడ్డి స్థానిక నాయకులతో కలిసి పనులను ప్రారంభించారు. కిష్టాపూర్ వీకర్ సెక్షన్ కాలనీలో రూ.16 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లు, అర్చన కాలనీలో రూ.16.75 లక్షల నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులు, కిష్టాపూర్ గ్రామ పరిధిలో రూ.4.75 లక్షల నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పూడూరు పీఏసీఎస్ డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.